# ఆడపిల్ల

-డా.కొఠారి వాణీ చలపతిరావు

వేదవతి ఆటో దిగింది. ఆటో శబ్దం విని హాల్లో నుంచి బయటకు వచ్చిన పెద్దన్న దివాకర్ ఆశ్చర్యం ముఖంలో, గొంతులో వ్యక్తం అవుతుండగా "వేద వచ్చింది" అన్నాడు.

"వేద వచ్చిందా?" అంటూ చిన్నన్న కరుణాకర్, తమ్ముడు హరీష్ కూడా వచ్చారు. ఆ వెంటే తల్లీ, తండ్రీ, వదినలు, మరదలు అంతా వచ్చి వసారాలో నిల్చున్నారు. పాలోమంటూ మేనల్లుళ్లు, మేనగోడళ్లు వచ్చారు.ఆటో అతనికి డబ్బులిచ్చి చంకలో పిల్లాడ్ని ఆ చేతి నుంచి ఈ చేతికి మార్చుకుని చిరునవ్వుతో అందరివంకా చూసింది వేదవతి. గ్రూప్ ఫోటోకు నిల్చున్నట్లు అక్కడ ఒకరి పక్కన ఒకరుగా కుటుంబమంతా ఉన్నారు.

అది చూసి 'అందరూ ఉన్నారు ఇక్కడ నేనొక్కదాన్నితప్ప. నేనూ మగపిల్లవాడ్ని అయి వుంటే తప్పక ఉండి ఉండేదాన్ని' అనుకుంది' మనసులో చోటు చేసుకున్న వెలితి ముఖంమీద కనబడకుండా మామూలుగా ఉంటూ.

"అకాలవర్షంలా ఉత్తరం ముక్క అయినా రాయకుండా ఏమిటే ఈ రాక?" అంది తల్లి అనసూయమ్మ ఎదురుగా వచ్చి మనవడ్ని అందుకుంటూ.

'అత్తయ్య వచ్చింది...అత్తయ్య వచ్చింది' అంటూ తనను చుట్టుముట్టిన పిల్లల్ని ముద్దు చేస్తూ "ఏం ఎప్పుడు పడితే అప్పుడు నేను రాకూడదా?" అంది వేదవతి నిష్టూరంగా తల్లిని ఉద్దేశించి.

"ఆహా...రాకూడదని కాదు. స్టేషన్‌కి ఎవరైనా వచ్చేవాళ్లుగా ముందు తెలిస్తే..."

"అన్నయ్యలు, తమ్ముడు, వదినలు, మరదలు, మేనల్లుళ్లు, మేనగోడళ్లు అందరూ వచ్చారని తెలిసి వచ్చాను" అంది వేదవతి తన రాకతో అప్పటికే వివర్ణమైన అందరి ముఖాల్లోకి గుచ్చి గుచ్చి చూస్తూ.

"శశిని తీసుకురాలేదేం?" మనవరాల్ని ఉద్దేశించి అంది అనసూయమ్మ.

"మా అత్తగారి వద్ద వుంచి వచ్చాను" అంది వేదవతి.

తల్లికీ తన రాక ఇష్టం లేదనీ, అయినా తల్లి కనుక ఆ భావం బయట పడకుండా మాటలతో, మర్యాదలతో తనను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందని అర్థమయింది ఆమెకు.

"కాళ్లు కడుక్కుందువుగానీ రా వేదా?" అని పెద్ద వదిన అనడంతో సందులోకెళుతూ హాల్లో చాపమీద అక్కడొకటీ, ఇక్కడొకటిగా పడివున్న స్టాంప్ పేపర్ల వంక ఒక్కసారి చూసి విషయం అర్థం చేసుకుంది వేదవతి. అప్పటిదాకా అంతా కూర్చుని మాటలు, చర్చలు చేసుకుంటున్నారు.

తను రాగానే అంతా లేచి వచ్చారు. తను కాళ్లు కడుక్కుని మళ్లీ హాల్లోకి వచ్చేసరికి "అవన్నీ తీసి లోపలపెట్టు" అని తండ్రి అనడం, చిన్నన్న చకచకా అన్నింటినీ తీసి చెక్కపెట్టెలో పెట్టడం వేదవతి కంటపడింది.

మరదలు మంచినీళ్లు అందిస్తూ "బాగున్నారా వదినగారూ" అని అడిగింది.

"మా అందరి భోజనాలు అయ్యాయి. నువ్వొరా వడ్డిస్తాను... ఇప్పటికే ఆలస్యమయింది" అంది.

"పిల్లాడికి నేను పెడతానులే. నువ్వు తినేసేయ్" అంది తల్లి.

"వద్దు... భోజనం చేసే బయల్దేరాను."

"పొద్దుననగా ఎప్పుడు తిన్నావో?"

"అయినా ఇప్పుడు తినలేను"

"పోనీ టిఫిన్ చేయండి" అంటూ పొద్దున చేసిన పూరీలు, కేసరి స్వీటు తెచ్చి చేతికందించింది మరదలు.

ఆ ప్లేటు తీసుకుంటుంటే కళ్ల వెంబడి నీళ్లొచ్చాయి వేదవతికి. అయినా గుడ్లలో నీరు గుడ్లలో కుక్కుకుంది.

'అందరూ ఇక్కడే ఉన్నారు. నన్ను మాత్రం పిలువలేదు. నాకు తెలియకుండా రహస్య సమావేశాలు చేస్తున్నారు. ఈ సమయంలో నేను ఇక్కడ ఉండకూడదనుకున్నారు కాబోలు. నా అంతట నేను వచ్చినా నా రాక వాళ్లకు సంతోషం కలిగించకపోగా విచారాన్ని, భయాన్ని కలిగిస్తోంది' అనుకుంది వేదవతి.

పైకి మాట్లాడుతున్నా అందరూ ముఖాలు ముడుచుకుని ఉన్నారు. నొసలు చిట్లించి ఉన్నారు.

ఆసక్తికరమైన విషయాన్ని కుటుంబ సభ్యులందరూ కూర్చుని మాట్లాడుకుంటుంటే పానకంలో పుడకలా పరాయి వ్యక్తి చేరితే ఎలా వుంటుందో అలా వుంది అందరి పరిస్థితి.

కాసేపు అనవాయితీగా కుశలప్రశ్నలు,కూతురి అత్తగారి ఆరోగ్య విషయాలూ, అల్లుడి క్షేమ సమాచారాలూ అడిగిన భూపాలరావుగారు-

"వాళ్లు ఆడవాళ్లు అంతా కూర్చుని ఏవో కబుర్లు చెప్పుకుంటారు. మనం అవతలి గదిలో కూర్చుని మాట్లాడుకుందాం పదండిరా" అన్నారు ముగ్గురు కొడుకులను ఉద్దేశించి.

'మీరేం మాట్లాడుకుంటారో మేం వినకపోతే ఎలా?' అన్న ఆలోచనను మనసులో దాచుకోవడం చేతకాక ఫేషియల్ ఎక్స్‌ప్రెషన్ ఇచ్చేసారు ఆడవాళ్లంతా నిరాశతో.

విషయం అర్థమైపోయింది వేదవతికి. ఇప్పటికైనా నేను నోరువిప్పి మాట్లాడకపోతే అవకాశం చేజారిపోతుంది అనిపించింది.

కూర్చున్న చోటునుంచి లేవబోతున్న తండ్రిని ఉద్దేశించి "నాన్నా! నేను మీతో మాట్లాడాలని వచ్చాను" అంది.

ఎంత ఖచ్చితంగా మాట్లాడదామనుకున్నా ఆ భావం అవలీలగా



గొంతులో పలకలేదు వేదవతికి.

"ఏ విషయం?" అన్నారు భూపాలరావుగారు.

"ఆస్తివిషయం. మీరు అన్నయ్యలకు, తమ్ముడికి ఆస్తి పంపకాలు చేస్తున్నారని తెలిసి వచ్చాను. వాళ్లతోపాటు సమంగా నాకూ వాటా ఇవ్వాలి"

ఆశ్చర్యంతో అదిరిపడ్డారు అందరూ.

వేదవతి రాకకు ఏదో కారణం ఉంది అనుకున్నారుగానీ అది ఇంత పెద్ద కారణమని ఎవ్వరూ అనుకోలేదు. తల్లి నగానట్రాలో అది కావాలి, ఇది కావాలి అని ఏమయినా అడుగుతుందేమో అనుకున్నారు.

అదయినా సరిగ్గా ఆస్తులు పంచుకునే సమయానికి రావడంవల్ల అలా అనిపించింది.


వేదవతి చాలా మెతకమనిషి. నోట్లో నాలుకలేనిది అన్నది ఆ కుటుంబ సభ్యులందరి ఏకాభిప్రాయమే కాదు, ఆమెను ఎరిగినవారందరూ అలానే అనుకుంటారు.



## రోబో టీచర్

టోక్యో యూనివర్శిటీ సైంటిస్టులు డెవలప్ చేసిన రోబో టీచర్ 'సాయా' ఇటీవల స్కూలుపిల్లలకి పాఠాలు చెప్పడం ఆరంభించింది. కేవలం చదువు చెప్పడమే కాకుండా పిల్లలు వేసిన ప్రశ్నలకు జవాబులు కూడా చెబుతుంది ఈ టీచర్. అంతేకాదు మామూలు మనిషిలా ఆశ్చర్యం, భయం, విసుగు, కోపం, సంతోషం, బాధ లాంటి హావభావ ప్రకటనల్ని తన ముఖంలో ప్రస్ఫుటంగా చూపిస్తుందిట.

-తటవర్తి




అలాంటి వేదవతి అంత ఓపెన్‌గా, అంత నిస్సంకోచంగా ఏకంగా ఆస్తిలో వాటానే అడగడం వాళ్లందరికీ ఓ షాక్.

"నువ్వేనా ఇలా మాట్లాడుతోంది. వేదవతీ... నువ్వేనా? నా కూతురు వేదవతేనా" అన్నారు భూపాలరావుగారు తనను తానే నమ్మలేనట్లుగా.

"నేను మీ కూతుర్నే. కూతుర్ని కనుకనే మాట్లాడుతున్నాను. మీరు పరాయివారయితే మీ ఆస్తిలో వాటాకు నాకేం హక్కు వుంటుంది" అంది వేదవతి.

తను మామూలుగానే అన్నాననుకుంది. కానీ తండ్రికి మరోలా వినిపించింది.

"హక్కులు మాట్లాడేంతగా వచ్చిందా వ్యవహారం?" అన్నారు.

"తండ్రి ఆస్తిలో ఆడపిల్లకు వాటా ఇవ్వడం అనేది ఎప్పుడైనా, ఎక్కడైనా వుందా అసలు? ఏం మాట్లాడుతున్నావు నువ్వు?" అన్నాడు పెద్దన్న దివాకర్ జోక్యం చేసుకుంటూ.

"ఇంతకుముందు లేకపోవచ్చు. మారుతున్న కాలాన్నిబట్టి ఇప్పుడు కొత్త లా వచ్చింది. ఎక్కడయినా వుందో లేదో నాకు తెలియదు. ఇక్కడ మనింట్లో మాత్రం ఉండాలని అంటున్నాను" అంది వేదవతి అన్న ప్రశ్నకు సమాధానంగా.

"మా అమ్మావాళ్లు కూడా పసుపుకుంకుమల కింద ఏదో కొంత డబ్బు ముట్టచెప్పారుగానీ మా అన్నదమ్ములతో సమానంగా ఆస్తిలో నాకు వాటా లేమీ పంచిపెట్టలేదు" అంది పెద్దవదిన తాయారు గొంతులో వ్యంగ్యం వుట్టిపడేలా.

"వదినా అడక్కుండా ఆడపిల్లకు ఆస్తిలో వాటా ఇచ్చేంత ఉన్నతస్థితికి మన సమాజం ఇంకా ఎదగలేదు. నువ్వు అడగలేదు కనుక మీ పుట్టింటివాళ్లు ఇవ్వలేదు. కానీ నేను ఇప్పుడు అడుగుతున్నాను"

"పసుపుకుంకుమల కింద నీకూ నాన్నగారు ఎంతో కొంత పైకం ముట్టచెబుదామనుకున్నారు" అన్నాడు చిన్నన్న.

"నా రెండుపేటల చంద్రహారం ఆడపిల్లవని నీకే ఇవ్వాలని ఎప్పుడో అనుకున్నాను" అంది తల్లి అనసూయమ్మ.

"నాకు ఎవరి దయాభిక్షావద్దు. న్యాయంగా నాకు రావాల్సింది నాకు ఇవ్వండి. అది కొంచెమైనా ఎక్కువైనా"

"కొంచెమైతే ఎందుకడుగుతావులే. ఇక్కడ ఎంత పొలం వుందో, ఎన్ని జాగాలు ఉన్నాయో, ఎంత బంగారం ఉందో అంతా తెలుసుకునే వచ్చి వుంటావు" అన్నాడు తమ్ముడు హరీష్ అక్కను ఉద్దేశించి దూకుడుగా.

"ఎవర్నో అడిగి ఎంక్వయిరీ చేసి రావాల్సిన అవసరం ఏముంది. మీకెంత వస్తుందో నాకూ అంతే వస్తుంది."

"అసలు ఆడపిల్లకు వాటా ఎందుకియ్యాలే. కట్నం ఇచ్చి పెళ్లిచేసాం" అన్నాడు తండ్రి కాస్త ఆవేశంగా.

"ఒక కట్నం నాకు ఇచ్చి ముగ్గురు కొడుకుల కట్నాలు తెచ్చుకున్నారు" దానికి తగ్గట్టే సమాధానం చెప్పింది వేదవతి.

"మీ మామగారు సంపాదించిన ఆస్తిపాస్తులు మీకు వస్తాయిగా?"

"అవి మా ఆయనవి. నావి కావు."

"నువ్వూ మీ ఆయనా ఒకటి కాదా"

"పర్మినెంట్‌గానో, టెంపరరీగానో పెళ్లి ఓ కాంట్రాక్ట్. ఒకరిమీద ఒకరు నమ్మకంతో కలసి బ్రతికేది. ఆ నమ్మకం వమ్మయి ఏదయినా గొడవలు వస్తే నేను బ్రతికి ఉండడానికి నా జీవన భృతి కోసం మా ఆయన నెలకు ఇంత అని డబ్బులు విదిలిస్తాడేమోగానీ వాళ్ల నాన్న ఆయనకు ఇచ్చిన ఆస్తిలో వాటా ఇవ్వడు. నా తండ్రి నుంచి హక్కుగా నాకు రావాల్సిన ఆస్తి ఉండగా ఎవరి దయాదాక్షిణ్యాలమీద నేను ఎందుకు ఆధారపడాలి? అయినా

నాన్నా! మీ కొడుకులు ముగ్గురిలో ఒకడికి నా ఆస్తిలో వాటా ఇవ్వను అని ఇప్పుడే అని చూడండి. ఊరుకుంటారేమో చూస్తాను. నేను ఆడపిల్లను కాబట్టేకదా మీరు ఇలా మాట్లాడుతున్నారు.''

"...''

"నాన్నా! ఈ ముగ్గురేకాదు ఇంకో ముగ్గురు కొడుకులున్నా మీరు మీ ఆస్తిని సమంగా పంచి ఇస్తారు. ఆడపిల్ల... అది ఒక్కతే అయినా సెంటు భూమి కూడా రాసివ్వరు. ఎందుకు నాన్నా ఈ వివక్ష? వాళ్ళలాగా నన్ను కన లేదా? కన్నతండ్రివయిన నిన్ను నేను డబ్బు అడగకూడదు. కానీ మధ్యలో వచ్చిన భర్త మందు మాత్రం పది రూపాయలకు చెయ్యి చాపాలా? తండ్రి ఇవ్వంది ఆడపిల్లకు ఆర్థిక స్థోమత, స్వాతంత్ర్యం ఎలా వస్తాయి నాన్నా?'' వేదవతి గుండెల్లో నుంచి దూసుకుని వస్తున్న ఒక్కొక్క మాటా ఒక్కో బుల్లెట్‌లా వచ్చి భూపాలరావు గుండెను తాకుతున్నాయి.

అయినా బయటికి కనిపించని ఆ గాయాన్ని లోపలే దాచుకుంటూ గాంభీర్యాన్ని, కోపాన్ని ప్రదర్శిస్తున్నారు.

ఊహించని వేదవతి కొత్త రూపం, గాలికి వదిలివేద్దామని ఎంత ప్రయత్నించినా వదలని ఆమె మాటలు ఉక్కిరిబిక్కిరి చేసాయి ఆ కుటుంబ సభ్యులందరినీ.

★★★

ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. పిల్లవాడ్ని పక్కలో పెట్టుకుని పడుకున్న వేదవతి శత్రు స్థావరంలో చిక్కుబడిన ఖైదీలా ఉంది. ఎవరూ తనతో మాట్లాడడంలేదు.

తననో డబ్బు మనిషిగా, కన్నవారిపట్ల కృతఘ్నురాలిగా, గంపగయ్యాళిగా చూస్తున్నారు.

ఏదో మాట్లాడుతున్నారుగానీ ఆ మాటల్లో ఆప్యాయతలేదు. టీ తాగమని, అన్నానికి రమ్మని అంటున్నారుగానీ ఆ అనడంలో ఎంత వెలితి చూసినా తప్పనిసరితనంతప్ప అమ్మతనంగానీ, ఆప్యాయతగానీ కనిపించడంలేదు.

'ఎందుకు వచ్చానా?' అనిపించింది వేదవతికి.

ఇలా వచ్చి ఉండకుంటే ఈ వేదవతి అందరి దృష్టిలో అణకువగల ఆడపిల్లగా ఇంతకుముందులా అలాగే ఉండిపోయేది. వచ్చి ఆస్తి అడిగి అందరికీ శత్రువునైపోయాను అని ఒక్క క్షణం ఆలోచించింది వేదవతి.

అంతలోనే ఆమె మనసు 'నువ్వు చేసింది కరెక్టే. తప్పేమీ చేయలేదు. డబ్బు ఆశతో నువ్వు ఇక్కడికి రాలేదు. అవసరం నిన్ను ఇక్కడకు తీసుకువచ్చింది. అంతేకాక ముప్పయి అయిదు సంవత్సరాలుగా వివక్షకు, పక్షపాత ధోరణికి గురి అయి సహనం నశించి నువ్వు అలా చేసావు. గుండెల్లో కొద్ది కొద్దిగా రగులుకున్న అగ్ని అగ్నిపర్వతమ అకస్మాత్తుగా ఇప్పుడు బద్ధలైంది అని సమర్థించగానే వేదవతి కళ్లముందు గతం గిర్రున తిరిగింది.

★★★

"వేదా! ఏం చేస్తున్నావు బయట... వచ్చి ఇంట్లో ఇల్లు ఊడ్వవేం?''

"వేదా...పనిమనిషి రాలేదు. వచ్చి అంట్లు తోము''

"వేదా.. ఎక్కడ చచ్చావే... వచ్చి బావిలో నుంచి రెండు బిందెలు నీళ్ల తోడు''

"వేదా... తమ్ముడు గుక్కపట్టి ఏడుస్తున్నాడు. వినబడడంలేదా. వచ్చి ఎత్తుకో... బట్టలు తడుపుకున్నాడేమో మార్చు''

కూతురు వేదవతితో తల్లి అనసూయ నిత్యం మాట్లాడే మాటలు, పెట్టే కేకలు ఇవే.

ఇంతకుమించి మరొకందుకు పిలవడం, లాలనగా మాట్లాడడం ఆమెకు రాదు.

ఇక తండ్రి అయితే ...

"వేదా! ఏమిటా గెంతులు మగపిల్లాడిలా?''


"వేదా! ఆడపిల్లలు పెద్దగా నవ్వకూడదు''

"వేదా! అన్నయ్యలతో కలసి గోలీలాడుతున్నావా? సిగ్గులేకపోతే సరి. లోపలకు వెళ్లు''

"వేదా... అస్తమానం చేతిలో ఆ పుస్తకం ఏమిటి? లోపలకు వెళ్లి అమ్మ చెప్పిన పని చేయి''


అంటూ ఎప్పుడూ కేకలేస్తూనే ఉంటాడు. ఉక్రోషం తన్నుకొచ్చేది వేదవతికి.

ఇంటి పనులు నేనే ఎందుకు చేయాలి ఎప్పుడూ? తమ్ముడిని నేనే



## నా అదృష్టం...!

దీపికా పదుకొనెకి ఇప్పుడు మంచి ఫ్రెండెవరయ్యా అంటే అశిన్ అంటున్నారు సినీజనాలు. 'నిజంగా అశిన్‌లాంటి ఫ్రెండ్ దొరకడం నా అదృష్టం' అంటోందిట. ఏమాత్రం ఖాళీ దొరికినా ఎస్సెమ్మెస్‌ల ద్వారా తెగ చాటింగ్ చేసుకుంటారట ఇద్దరూ. పైగా ఇద్దరూ తండ్రి చాటు కూతుళ్లేనట. అంతేకాదు, తమ తండ్రులకు ఇష్టమైన బిడ్డలు కూడా. ఒకరు కన్నడ భామ అయితే మరొకరు కేరళ కుట్టి. అంటే దక్షిణాది వారే.



ఎందుకు ఎత్తుకోవాలి?

అన్నయ్యలు ఎత్తుకోకూడదా? నాన్న... అన్నయ్యలను ఏమీ అనకుండా నన్నే ఎప్పుడూ ఎందుకు అరుస్తూ ఉంటారు. ఆడపిల్లలు నవ్వకూడదా? ఆడుకోకూడదా? పుస్తకం చదవడం కూడా తప్పేనా? అన్నయ్యలకు 'బాగా చదవండిరా' అని రోజుకు పదిసార్లయినా చెబుతుంటారే మరి' అని మనసులోనే విసుక్కుంటూ చీపురు చేతబట్టుకుని ఇల్లంతా ఊడ్చింది వేదవతి. అంట్లు కడిగి తమ్ముడిని ఎత్తుకుని ఆడించింది.

తీరిక దొరికినప్పుడల్లా చిన్నారి వేదవతి చిన్ని మెదడులో ఎన్ని ఆలోచనలో.

అన్నయ్యల ప్రస్తావన అమ్మ నోట వచ్చినప్పుడల్లా వాళ్లను 'వంశోద్ధారకులు' అంటుంది.

తల్లిదండ్రులకు పుణ్యగతులు కలిగించే వాళ్లట. ఎంత గారాబం చేస్తారో అన్నయ్యలను, తమ్ముడిని. దానికితోడు అమ్మకు తమ్ముడు వరసయ్యే ఆయన ఒకాయన చీటికిమాటికి సంచీ పట్టుకుని దిగబడుతూ ఉంటాడు.

వస్తూనే 'ప్లస్...మైనస్' అంటూ వస్తాడు. అన్నయ్యలు, తమ్ముడు ప్లస్ అట, తను మైనస్ అట అనుకుంటుంది రోషంగా వేదవతి.

పక్కింటి అన్నపూర్ణమ్మగారు ఓసారి గోడమీద నుంచి మాట్లాడుతూ "ఒక్కగానొక్క ఆడపిల్ల. మీ ఇంటి మహాలక్ష్మి" అంది.

"ఏం మహాలక్ష్మిలెండి పిన్నిగారు. ఒక్కతే అయినా ఆడపిల్ల అనేసరికి ఎన్ని చేయాలి? బోలెడు కట్నం పోసి పెళ్లి చేయాలి. నగానట్రా చేయించాలి. చీరసారె పెట్టాలి. సీమంతమని, బారసాల అని పండుగని, పబ్బమని ఎన్ని ఉంటాయి? మీకంతా మగపిల్లలే... మీరు అదృష్టవంతులు" అంది.

మనస్సు చివుక్కుమంది వేదవతికి.

'అమ్మకు నామీద పిసరంతయినా ప్రేమ లేదా? ఆడపిల్ల అంటే అమ్మకు ఎందుకు అంత అలుసు? తనూ ఆడదేగా మరి?' అని ఎన్నిసార్లు ఆశ్చర్యపోయేదో లెక్కలేదు వేదవతికి.

ప్రతిదానికీ తనంటే చిన్నచూపు, అశ్రద్ధ, అలక్ష్యమే అనుకుంది బాధగా. అనసూయ, భూపాలరావు దంపతులు మగపిల్లలను ఇద్దరినీ బస్తీ పంపి చదివిస్తున్నారు. వేదవతికి చదువంటే ప్రాణం.

స్కూల్లో టీచర్లు "ఏం చదువుతావు?" అంటే "మెడిసిన్" అని ఠక్కున చెప్పేది సమాధానం.

"తప్పక చదువుతావు. అంతటి అఖండమైన తెలివితేటలు నీవి" అనేది టీచర్.

"ఆడపిల్లవు నీకు పెద్ద చదువులెందుకు? ఓ అయ్య చేతిలో పెడితే అత్తారింటికి వెళ్లాల్సినదానివి" అంటూ తొమ్మిదో క్లాసుతో చదువు మాన్పించి పెద్దన్నను డాక్టర్ చదువుకు పట్నం పంపినప్పుడు వెక్కివెక్కి ఏడ్చింది వేదవతి.

రెండో అన్నను ఇంజనీరింగ్ చదువుకు పంపించినప్పుడు మరోసారి ఏడ్చింది.

రెండుసార్లూ సంచీ పట్టుకుని దిగబడిపోయిన మామయ్య 'కట్నమే మైనస్ అంటే చదువుకు పెట్టే ఖర్చు మరో మైనసా? పెద్ద చదువులు చదివి సంపాదించింది అది మొగుడుకూ, పిల్లలకు ఖర్చు పెడుతుందిగానీ మీకేమైనా ఇస్తుందా?' అంటూ ఆడపిల్లలకు చదువులు అనవసరం అని సలహా ఇచ్చాడు తనే పెద్ద తెలివిగలవాడిగా.

పద్దెనిమిదవ ఏట వేదవతి అడుగుపెట్టడం ఆలస్యం 'బ్రహ్మాండమైన సంబంధం తెచ్చాను' అంటూ మళ్లీ తయారు ఆ సంచీ మామయ్య.


'గుండెలమీద కుంపటి దింపుకోవాలి' అంటూ భూపాలరావు, అనసూయ ఉరుకులు పరుగులు పెట్టి హడావుడి చేసి ప్రకాశం చేత మూడు ముళ్లు వేయించారు. దాంతో పెనంమీద నుంచి పొయ్యిలో పడ్డట్టయింది వేదవతి జీవితం.

★★★

పుట్టింట్లో అంతమంది మధ్యా ఒంటరిగా కొడుకును పక్కలో పెట్టుకుని పడుకున్న వేదవతి అటు నుంచి ఇటు తిరిగి వత్తిగిల్లి పడుకుంది. బాల్యం నుంచి ఆమె ఆలోచనలు ఇప్పుడు భర్తవైపు మళ్లాయి. పెళ్లయిన కొత్తలో ఒకరోజు-


"వేదా! నా పర్స్‌లో నుంచి డబ్బులు తీసావా?" గద్దిస్తున్నట్లుగా అడిగాడు ప్రకాశం వేదవతిని.

"అవునండీ ఇరవై రూపాయలు తీసాను. ఇంటిముందుకు కూరలొస్తే



## శ్రీరంగనీతులు

తెలుగులో 'ఎ ఫిలిం బై అరవింద్'లో నటించిన బాలీవుడ్ భామ మోనా చోప్రా తన పేరుని షెర్లిన్ చోప్రాగా మార్చుకున్నాక కొన్ని సినిమాల్లో మోతాదు మించిన సెక్సీగా నటించింది. అయితే ఇటీవల ఆమెకి ఓ కండోమ్ యాడ్‌లో నటించే ఆఫర్ వస్తే దాన్ని తిరస్కరించింది. అదేంటీ యాడ్ ఎందుకు చేయలేదూ? అంటే 'ఇప్పుడిప్పుడే నాకు బాలీవుడ్‌లో సినిమాలు ఎక్కువవుతున్నాయి. ఇలాంటి సమయంలో నాపై సెక్స్‌బాంబ్ ముద్ర పడిపోతుందని ఆ యాడ్ చేయలేదు' అని పలికింది.



కొన్నాను''

"ఇంకెప్పుడూ అలా నా జేబులో నుంచి డబ్బులు తీయకు'' అన్నాడు ప్రకాశం కఠినంగా.

ఆశ్చర్యపోయింది వేదవతి.

"ఇంట్లోకి ఏది కావాలన్నా నేనే తెస్తాను'' అని విసురుగా అక్కడినుంచి వెళ్లిపోయాడు ఆ తరువాత.

అన్నట్లుగానే బియ్యం, పప్పులు, కూరలు అన్నీ తనే తేవడం మొదలు పెట్టాడు.

ఆయన ఇంట్లో లేనప్పుడు ఏమన్నా కావాలంటే వెళ్లి తెచ్చుకోవడానికి వేదవతి దగ్గర డబ్బులుండవు.

'ఇవి నీ ఖర్చులకు ఉంచు' అని వంద రూపాయలు కూడా ఇవ్వడు, ఇంట్లో ఉంచడు. దాంతో ఉన్నవాటితోనే సర్దుకోవడం అలవాటు చేసుకుంది.

తనకోసం అంటూ ఏమీ కొనుక్కోకపోయినా పిల్లలు పుట్టాక వాళ్లు అవీ ఇవీ కావాలని అడుగుతుంటే గుండె పిండేసినట్లు ఉండేది వేదవతికి.

ఉద్యోగం చేసి తనకు కావాల్సిన డబ్బులు సంపాదించుకోవడానికి చేతిలో క్వాలిఫికేషన్స్ లేవు.

ఏదైనా చిన్న ఉద్యోగమైనా చేసి రెండుమూడు వేలైనా సంపాదించుకోవాలని నిర్ణయించుకుని భర్తతో అంటే-

"ఏం చదువుకున్నావని ఉద్యోగం చేయడానికి? చిన్నాచితక ఉద్యోగాలు చేసి నా పరువు తీయక్కర్లేదు. ఇంట్లోనే ఉండి అమ్మను, పిల్లలను చూసుకో'' అన్నాడు.

దాంతో ఏం చేయాలో పాలుపోక ఏడ్చేసింది వేదవతి. చేతిలో నాలుగు డబ్బులుండే మార్గమేదీ దొరకలేదు. తండ్రో, అన్నో చూడడానికి వచ్చినప్పుడు పండ్లు, పిల్లలకు చాక్లెట్లు, బిస్కెట్లు కొనుక్కుని వచ్చేవాళ్లుగానీ 'చేతిలో వుంచుకోమ్మా' అని డబ్బులు ఇచ్చేవారు కాదు. వేదవతి అక్కడికి వెళ్లినప్పుడు కూడా అంతే!

పసుపు, కుంకుమలు, చీర, చలిమిడి పెట్టేవాళ్లుగానీ డబ్బులు ఇచ్చేవాళ్లుకాదు.

ఒకసారి పిల్లలతో బయటకి వెళ్లినప్పుడు చాలా అవసరం పడి "అమ్మా! నా దగ్గర చిల్లరలేదు. ఓ వంద రూపాయలు వుంటే ఇవ్వు'' అని తల్లి దగ్గర డబ్బులు తీసుకుంటే వారం తరువాత 'నువ్వు నాకు వంద రూపాయలు ఇవ్వాలికదా. దానితో చంటిదానికి అక్కడికి వెళ్లాక ఓ గౌను కొనుక్కో' అని తల్లి లెక్క చెప్పడం బాధ కలిగింది వేదవతికి.

'ఆడపిల్ల తల్లిదండ్రులకు పెళ్లి కాకముందు, పెళ్లయిన తరువాత కూడా 'ఆడ'పిల్లే... పుడుతూనే పరాయిది. అందుకే అన్ వాంటెడ్ చైల్డ్‌గా తప్పనిసరి పరిస్థితిలో పెంచుకుంటుంటారు.

ఇది చాలా చోట్లా ఉన్నదే. కానీ కట్టుకున్న భర్త సైతం పరాయిదానిగా చూడడం తనలాంటి కొద్దిమంది విషయంలోనే జరుగుతుండవచ్చు అనుకుంది వేదవతి.

ఇంటికి ఎవరువచ్చినా భర్త ప్రకాశం 'నా ఇల్లు, నా పిల్లలు, నా పొలం' అనే చెబుతాడు.

'కొండాపూర్‌లో నాకు ఒక ప్లాట్ ఉందిరా. దాన్ని అమ్మాలనుకుంటున్నాను' అన్నాడు ఓరోజు మిత్రునితో.

దాంతో ఆ ఇంట్లో ఆయన ఆస్తిలో, ఆయన డబ్బులో తనకేమీ హక్కు లేదనీ, 'మా', 'మన' అంటూ తనను అతనితో కలుపుకోవడానికి ఇష్టపడడని అర్థమైపోయింది వేదవతికి.

ఆ క్షణంలో అన్నలు, తమ్ముడితోపాటు తనను చదివించని అమ్మానాన్నలమీద విపరీతమైన కోపం వచ్చింది.

'గుండెలమీద కుంపటి' అంటూ పెళ్లి పేరిట తనను వదిలించుకోవడానికి వాళ్లు పడ్డ తొందర, ఆరాటం గుర్తుకువచ్చి తల్లిదండ్రులమీద విరక్తి పెరిగిపోయింది. అది రానురాను కసిగా మారిపోయింది వేదవతిలో.

అవసరాలు, ఆర్థిక ఇబ్బందులు ఆ కసిని మరింత పెంచి అంతకంతకూ భరించలేని వత్తిడిని ఆమెలో కలిగించాయి.

అందుకే ఆరోజు ఓ విస్ఫోటనంలా పుట్టింటివాళ్ల గుండెల్లో పేలింది వేదవతి.

***

నిన్నటి షాక్ నుంచి ఆ ఇంట్లో ఇంకా ఎవ్వరూ కోలుకున్నట్లులేదు. అందరి ముఖాలు మాడిపోయిన బల్బుల్లా ఉన్నాయి.


చూపుల్లో వేదవతిమీద కోపమూ, నిరసనా అతి స్పష్టంగా కనిపిస్తు



## అంతఃపుర రహస్యం

ఫ్రాన్స్ రాజు లూయిస్-XI కాలంలో అంతఃపుర స్త్రీలు ఏ ఘన పదార్థాలు తినకుండా కేవలం సూప్స్ లాంటి ద్రవ పదార్థాలనే సర్వ్ చేసేవారుట. ఘన పదార్థాలను తింటే పళ్లు అరిగిపోయి ఊడిపోతాయన్న భయం వల్ల అలా చేసేవారట.

-తటవర్తి



న్నాయి. మజ్జిగ చిలుకుతూ తల్లి అనసూయమ్మ "ఆడపిల్లలు ఈ రోజుల్లో ఆడపిల్లలుగా అణకువగా, ప్రేమగా ఉండడంలేదు. మగపిల్లలను మించిపోతున్నారు.

వాళ్లకన్నా వీళ్లకే తల్లిదండ్రులమీద ఇష్టం, గౌరవం ఉంటాయని అంటారుగానీ అవన్నీ ఉత్తి మాటలే" ఆమె అంటున్న మాటలు చల్ల కవ్వం శబ్దంలో కలిసినా స్పష్టంగానే వినిపించాయి వేదవతికి.

ముఖం కడుక్కుందామని సందులోకెళ్తుంటే అప్పటికే అక్కడున్న వదినలిద్దరూ-

"ఆస్తి కోసం వచ్చి ఎలా ఇంట్లో తిష్ట వేసిందో చూడు. ఇవ్వకపోతే ఇంకా ఎంత గొడవ చేస్తుందో ఏమో? సిగ్గు లేకపోతే సరి" అని గుసగుసగా చెప్పుకోవడం కూడా వేదవతికి వినబడింది.

స్నానంచేసి తువ్వాలుతో వళ్లు తుడుచుకుంటూ "ఇలాంటి ఆడపిల్ల ఇంతవరకూ మా వంశంలో ఎవ్వరికీ పుట్టి ఉండదు. ఆడపిల్ల కన్నవాళ్లను నిలదీసి ఆస్తి పంపకాలు అడిగిందంటే బంధువుల్లో ఎంత అవమానం తల్లిదండ్రులకు. ఈవిషయం బయటపడితే ఇక తలెత్తుకుని నలుగురిలో తిరగలేం" అంటున్నాడు బావి దగ్గర స్నానం చేస్తున్న తండ్రి భూపాలరావు.

ఇక అన్నలు, తమ్ముడు అయితే వేదవతి ఎదురుపడితే అంటరానిది అన్నట్లు తప్పుకుని పోతున్నారు.

అందరి పంక్తిన భోజనం పెట్టి ఆమెను పిలుస్తున్నారుగానీ ఎవ్వరూ మాట్లాడకుండా అందరూ తలలు వంచుకుని తింటున్నారు. పిల్లవాడిని ఎవ్వరూ దగ్గరికి పిలిచి ముద్దు చేయడంలేదు. అన్న పిల్లలతో కలసి అప్పుడప్పుడు ఆడుకుంటున్నాడు అంతే.

అలాంటి వాతావరణంలో ముళ్లమీద వున్నట్లుగా మూడురోజులు వుంది వేదవతి. అయినా ఎవ్వరూ ఆస్తి పంపకాల గురించి మాట్లాడడం లేదు. వాటికి సంబంధించిన దస్తావేజులు, డాక్యుమెంట్లు రహస్యంగా ఎక్కడ దాచిపెట్టారోగానీ బయటకి తియ్యడంలేదు. వాటి ప్రస్తావన తేవడం లేదు.

తనను శత్రువుగా చూస్తున్న ఆ ఇంట్లో ఇంకొక్క క్షణం కూడా ఉండ బుద్ధి కావడంలేదు. తన ఇంటి నుంచి ఇక్కడికి వచ్చేటప్పుడు ఎందుకు వెళ్తోందీ కారణం చెప్పకుండా 'అమ్మానాన్నలను చూసి వస్తాను ఒకటి రెండురోజుల్లో' అని అత్తగారికి చెప్పి కూతుర్ని ఆమె దగ్గరే వదిలేసివచ్చింది.

తను త్వరగా వెళ్లాలి. నాన్న మాత్రం ఏ విషయం తేల్చడంలేదు. ఎదురు చూసీ చూసీ తను వెళ్లిపోతే తరువాత ఆస్తి కొడుకులకు పంచుదామన్న ప్లానులో ఉన్నాడు.

ప్రస్తుతం తన అవసరాలకు డబ్బు, భవిష్యత్తులో తన బ్రతుకు భద్రతకు తనకు కొంత స్థిరాస్తి కావాలి.

అందుకు ఒకే ఒక మార్గం... తండ్రి నుంచి తనకు న్యాయంగా సంక్రమించాల్సిన ఆస్తిలో వాటా కోసం వచ్చింది.

అయినా వీళ్ల ఇంటి ఇంటి దగ్గర బిచ్చగత్తెలా అడుక్కోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఆలోచిస్తుంటే రక్తం వేడెక్కిపోయింది వేదవతికి.

★★★

మూడోరోజు ఉదయం బ్యాగ్ సర్దుకుంటూ "నాన్నా! నేను అడిగిన విషయం ఏం చేసారు?" అని అడిగింది చాలా క్యాజువల్‌గా.


దాంతో మళ్లీ నివ్వెరపోయి చూసాడు తండ్రి. పట్టించుకోనట్లు తను మౌనంగా ఉంటే మళ్లీ అడిగే ధైర్యం లేక ఏడుస్తూ కూతురు వెళ్లిపోతుందని అనుకుని ఉంటాడు.

కానీ అలా జరగకపోయేసరికి ఆయనకు లోపలినుంచి తన్నుకొచ్చింది ఉక్రోషం.

"ఏదో ఆడపిల్లవు కదా అని పసుపుకుంకుమల కింద కొంత పైకం, మీ అమ్మ గొలుసు ఒకటి ఇద్దామనుకున్నాను. ఇంతగా బరితెగించి అడుగుతున్నావు కనుక ఒక్క రూపాయి కూడా ఇవ్వను. ఇదే నా నిర్ణయం" అన్నాడు భూపాలరావు పిడికిలి బిగించి కళ్లెర్ర చేస్తూ.

ఆ మాటలతో బ్యాగ్ చేతిలో పట్టుకుని పిల్లాడిని ఎత్తుకుని కోపంగా నాలుగు అడుగులు ముందుకేసి ఒక్క క్షణం ఆగి "అయితే మనం మళ్లీ కలుసుకునేది కోర్టులోనే. పసుపుకుంకుమల పైకం కోసం కాదు, ఆస్తిలో వాటా కోసం" అంటూ చకచకా వెళ్లిపోయింది వేదవతి వెనుక నుంచున్న వాళ్లందరూ శిలాప్రతిమలై చూస్తుండగా!

★



## తీరని కోరిక

మమతా మోహన్‌దాస్ చూడ్డానికి బక్కపల్చగా వున్నా ఆమెకి మాత్రం ఓ బరువైన కోరిక వుందటండోయ్. అదేంటంటే- 1000 సిసి బైక్ నడిపించాలనిట. బైక్ నడిపిస్తానంటే అందుకు వాళ్ల డాడీ ఒప్పుకోలేదట. అవును మరి, ఆ బైక్‌ని బ్యాలెన్స్ చేయగల శక్తి ఆమెకి వుందా అని ఎవరికైనా డౌటొస్తుంది కదా! తను ఇప్పుడు సినిమా తారగా బోల్డు సంపాదిస్తోంది గనుక ఆర్థిక స్వేచ్ఛ వుంది కాబట్టి ఎప్పటికైనా ఓ 1000 సిసి బైక్ కొనుక్కుని నడిపిస్తానంటోంది మమత.

